క్లుప్తంగా

చిన్న పిల్లల వైద్యుడిగా డాక్టర్ రత్నాకర్

మదనపల్లె : స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చిన్న పిల్లల వైద్యుడిగా డాక్టర్ రత్నాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులుగా పని చేస్తూ పదోన్నతిపై గుంటూరు ప్రభుత్వాసుపత్రికి బదిలీ అయ్యారు. మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు డాక్టర్ రత్నాకర్‌ను తిరిగి మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి బదిలీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యుల కొరత తీరింది.

గురుకులాల్లో ప్రవేశానికి 28 వరకు గడువు

కేవీపల్లె : ఏపీ గురుకుల విద్యాలయాల ప్రవేశ దరఖాస్తుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు గ్యారంపల్లె ఏపీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. 5, 6, 7, 8 తరగతులు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందడానికి ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

కలికిరి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి సోమవారం ఎస్సీ ఎస్టీ విభాగం మదనపల్లి డీఎస్పీ సుధాకర్ విచారణ చేపట్టారు. పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధికి చెందిన ఓ మహిళ తన ఇల్లు మార్చుతుండగా సహాయంగా వెళ్ళిన మధుపై ఆ వీధికి చెందిన హనీఫ్, అతని అనుచరులు దాడి చేసి గాయపరచిన ఘటనలో మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ మేరకు మదనపల్లి డీఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు, స్థానికులను విచారించారు. ఆయన వెంట వాల్మీకిపురం సీఐ నాగేంద్ర, పీసీలు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటకొండ ఎగువ తాండా సమీపంలో సారా వండుతున్నట్లు ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. 600 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

ఉచిత ఖత్నాకు స్పందన

పెద్దమండ్యం: మండలంలోని ఎస్‌వోపల్లె పంచాయతీ కలిచెర్ల పాతురులో మదరసా అరబి రషీదియాలో సోమవారం నిర్వహించిన ఉచిత ఖత్న (వడుగులు) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మదనపల్లెకు చెందిన డాక్టర్ సికిందర్ పిల్లలకు ఖత్నా చేశారు. ఖత్నా చేసుకున్న చిన్నారులకు మదరసా ఏ అరబియా రషిదియా కమిటీ వారి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు, భోజన సరుకులు పంపిణీ చేశారు. కలిచెర్ల, పాతూరు, శిద్దవరం, పెద్దమండ్యం, పాపేపల్లె గ్రామాల నుండి వడుగులు చేయించుకోవడానికి చిన్నారులను తల్లిదండ్రులు తీసుకొచ్చారు. కార్యక్రమంలో ముతవల్లీ గౌస్‌పీర్, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మకు కుంభాభిషేకం

కలికిరి: మండలంలోని మునెళ్ళపల్లి గ్రామం మూరేవాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం అమ్మవారికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం మహాకుంభాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అమ్మవారి గ్రామోత్సవం, తిరునాల నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

ములకలచెరువు: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కోనేటివారిపల్లె పంచాయతీ గొడ్డావులకోటకు చెందిన పూజారి నగేష్ (32) ములకలచెరువులో దుస్తుల దుకాణం నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళ్తుండగా కదిరి రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా నగేష్‌ను మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోగులకు అన్నదానం

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శంకర్ నేత్రాలయ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు పాఠశాల ఉపాధ్యాయుడు నామా చంద్రశేఖర్ అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించారు. ప్రతి నెలా జరిగే కంటి శిబిరంలో రోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

నేడు పెద్దగంగమ్మ జాతర

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం పాశంవారిపల్లెలో పెద్ద గంగమ్మ జాతరను మంగళవారం నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో ఛైర్మన్ దండు కృష్ణారెడ్డి తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని, గ్రామాలను పచ్చదనం, పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికం లేని గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలహిత గ్రామం, నీటి సమృద్ధి గల గ్రామం, పరిశుభ్రమైన హరిత గ్రామం, స్వయం సమృద్ధి ఉన్న మౌళిక సదుపాయాలు ఉన్న గ్రామం, సామాజిక సురక్షితమైన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, లింగ సమానత్వంలో మరింతగా గ్రామాభివృద్ధి తదితర వాటిపై సాధించిన ప్రగతిని పరిగణలోకి తీసుకొని గ్రామ పంచాయతీలు అవార్డులను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, సర్పంచ్‌లు రజని, జయచంద్ర, మునిభాస్కర్, గుర్రప్ప, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఈవో ఉదయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శిలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పేదరికం లేని సుస్థిర పాలన అందించడమే పంచాయతీరాజ్ వ్యవస్థ లక్ష్యమని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ మహమూద్, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, ఎంపీడీఓ శంకరయ్యలు మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. తర్వాత జరిగిన సమావేశంలో శంకరయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీలు సాధించిన ప్రగతి ఆధారంగా ప్రసంశాపత్రాలను సర్పంచులకు అందించారు. తొమ్మిది అంశాల్లో సాధించిన ప్రగతిపై చర్చించారు. ఈఓఆర్‌డీ షర్ఫుద్దీన్, సర్పంచులు భీమిగాని నాగిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, గిరిజ, చంద్ర, రుక్మిణి, అదెప్ప, ఉజ్జయిని సాంబశివ, లక్ష్మిదేవి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, కోఆప్షన్ నాసిర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నగిరిమడుగు పంచాయతీ సర్పంచ్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పంచాయతీల అభివృద్ధికి సమష్టి కృషి

కేవీపల్లె : గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక సంఘం నిధులతోపాటు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు స్థానిక ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రణాళికాబద్ధంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధి, పనులు, నిధులపై సమీక్షించారు. ప్రతి పంచాయతీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ సాయిలీలా, ఎంపీడీఓ అశ్విని సర్పంచులకు, ఎంపీటీసీలను కోరారు.

కలికిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ గంగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, ఈఓపీఆర్డీ ఆజాద్, సర్పంచ్‌లు వెంకట రెడ్డి, సీకాం సురేంద్రరెడ్డి, గంగయ్య, అరుణకుమారి, ఎంపీటీసీ సభ్యులు అల్లాబక్షు, షాహీనా, భారతి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

పెద్దమండ్యం: ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పల్లెల్లో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి, వారికి మెరుగైన సేవలందించినప్పుడే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు గుర్తింపు లభిస్తుందన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించే గ్రామసభలకు ఆయా శాఖల అధికారులు పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలన్నారు. గ్రామ సచివాలయాలలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా ఎంపికైన మొలక బయ్యారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పీలేరు : సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఈఓ రెడ్డిప్రసాద్‌రెడ్డిలను సన్మానిస్తున్న కలెక్టర్

గ్రామాల అభివద్ధికి కృషి చేయాలి

నిమ్మనపల్లె : గ్రామాల అభివద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీపీ నరసింహులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎంపీడీవో లీలామాధురి ఆధ్వర్యంలో నిర్వహించారు. సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల స్థాయిలో మెరుగైన పనితీరు కనబరచిన పంచాయతీ కార్యదర్శులకు సర్పంచులతో కలిసి ప్రశంశాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీల అభివద్ధిలో సర్పంచులు, కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వరలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప, మహదేవరెడ్డి, చెన్నరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, ఏపీఎం రజనీకుమారి, ఏపీవో రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథరెడ్డి, ఎంఈవో రాజగోపాల్, హౌసింగ్ ఏఈ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్‌తోనే గ్రామాల అభివృద్ధి

కలకడ : పంచాయతీరాజ్ వ్యవస్థతోనే గ్రామాల అభివద్ధి సాధ్యమని, అందుకే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మూడు అంచల వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించి, అభినందించారు. గ్రామస్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ఉత్తమ కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, నడిమిచెర్ల ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, ఏపీఓ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు

పీలేరు : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుగొమ్మలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ హుమవయూన్, ఉదయ్‌కుమార్, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, ఏఈ తేజేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

● పల్లె ప్రగతికి పురస్కారాలు

జిల్లాలో 2021– 22 ఆర్థిక సంవత్సరానికిగాను 'స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు గల గ్రామ పంచాయతీ' విభాగంలో ఉత్తమ పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం రాయచోటిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలో ఉత్తమ పంచాయతీలను గుర్తించి అవార్డులు అందజేశారు. ఆయ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, డీపీఓ ధనలక్ష్మి చేతుల మీదుగా ప్రశాంసా పత్రం, మెమెంటోను అందజేసి సత్కరించారు.

– మదనపల్లె



నిమ్మనపల్లె: రెడ్డివారిపల్లె సర్పంచ్, కార్యదర్శులను ప్రశంశాపత్రం అందజేస్తున్న కలెక్టర్ పీఎస్ గిరీషా



కలకడ: కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మునిరాజుకు సన్మానం



తంబళ్లపల్లె: సర్పంచ్ సుగుణమ్మ, పంచాయతీ కార్యదర్శి రఘునాథ్‌కు సన్మానం



రామసముద్రం : సర్పంచ్ నారాయణమ్మ, కార్యదర్శి షబీనాకు సన్మానం



పెద్దమండ్యం: కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సర్పంచ్ బయ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి



కురబలకోట: అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, కార్యదర్శికి జిల్లా కలెక్టర్ సత్కారం



కలికిరి: జిల్లా కలెక్టరు, జెడ్పీ చైర్మన్‌ల నుంచి ప్రశాంసా పత్రం, మెమెంటో అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

జగన్ పాలనలో మైనార్టీలకు గౌరవం

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రంలో మైనార్టీలకు సముచిత గౌరవం కల్పించినట్లు రాష్ట్ర భూగర్భవనరులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మదనపల్లి పర్యటనకు వెళ్తున్న ఆయనను వాల్మీకిపురంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలసి మైనార్టీలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు ఉన్నతమైన ఉప ముఖ్యమంత్రి పదవి, శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ పదవితో పాటు నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు చేయడంతో పాటు 12 మందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ముగ్గురికి ప్రభుత్వ సలహాదారుల పదవులు, రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ ఛైర్మన్ పదవిని ఇచ్చిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మైనార్టీలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, చింతల రమేష్ రెడ్డి, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, వెంకట రెడ్డి, మునిభాస్కర్, రాయుడు, చికెన్‌మస్తాన్, సైపుల్లా, ఉమర్ సాహెబ్, బాబు, సాధిక్, షాహెద్, మహబూబ్‌బాషా, సత్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చింతల


పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

వాల్మీకిపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పీలేరు నియోజకవర్గంలోని చిన్నగొట్టిగల్లు, వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కెవిపల్లి, పీలేరు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు 4, అంగన్‌వాడీ హెల్పర్లు 12 మంది నూతనంగా ఎంపిక య్యారు. వీరికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పని చేసే కార్యకర్తల పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని అందిస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీలు వందశాతం నిరుపేద పిల్లలకు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడీపీఓలు భారతి, రాజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిపుష్టి

కేవీపల్లె : ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధించే విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపురం పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం విస్తృతంగా చేపట్టారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల గురించి వివరించారు. గత ప్రభుత్వం కంటే ఎన్నో ఎక్కువగా పథకాలు ప్రస్తుత ప్రభుత్వం అందిస్తోందన్న విషయం ప్రజలు గ్రహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సి. గోవర్ధన్‌రెడ్డి, పి. ముద్దుకృష్ణ, పి. అమరనాథ్, బి. రామ్మోహన్, పి. భాషాఖాన్, మియాజాన్, ముస్తాఫా, ఇక్బాల్, అలిహుస్సేన్, వెంకటరమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట పండుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్, రాయలవారిపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

పీలేరు – చెన్నై బస్సు ప్రారంభం

పీలేరు రూరల్ : పీలేరు – చెన్నై ఆర్టీసీ బస్సు సర్వీసును రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ డైరెక్టర్ ఎ. రాజారెడ్డి ప్రారంభించారు. సోమవారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సును పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరుకు చెందిన పలువురు వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రయాణీకులకు నేరుగా చెన్నై వెళ్లే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కుమార్, సీఐ ధనుంజయలు, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథ్‌రెడ్డి, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, యూనియన్ నాయకులు రాజు, రమణ, చంద్రశేఖర్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీపై శిక్షణ

బి.కొత్తకోట: ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీపై సోమవారం స్థానిక ఎమ్మార్సీలో హెచ్‌ఎంలకు బాలికల హైస్కూల్‌లో ఎంఈవో ఆర్.రెడ్డిశేఖర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 నాటికి పాఠశాల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వాటి వివరాలు, ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 29లోగా ఈ పనులు పూర్తి చేయాలన్నారు. సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లు, సభ్యులు పాఠశాలల్లో భౌతిక వసతులను పరిశీలించాలన్నారు. తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల సంఖ్య, బాలికలపై వేధింపులు, బాల్య వివాహాల స్థితిగతులను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ: పాలిసెట్ ఉచిత శిక్షణ విద్యార్థులు ఉపయోగించుకోవాలని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ సీనియర్ ఫ్యాకల్టీ జనార్దన్ అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్ శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు ఇక్కడ శిక్షణ ఇస్తారన్నారు. పాలిసెట్‌తో పాటు ఏపీఆర్‌జేసీకి దరఖాస్తు చేసుకున్న వారు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదోతరగతి విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సు చేసి తరువాత ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరవచ్చునన్నారు. చాలా మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులు బేబి శ్యామల, తులసీరాం, మణికందన్, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రెడ్డన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సేవా తత్పరులు

పీలేరు : ఆర్యవైశ్యులు సేవా తత్పరులని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంలో పలువురు ఆర్యవైశ్యులు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారి వ్యాపారాలు దెబ్బతినకూడదనే ఉద్దేశంలో ఆర్‌వోబీ పనుల్లో భాగంగా ఎక్కువ నష్టం వాటిల్లకుండా వెడల్పు తగ్గించినట్లు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ తోడ్పాటునిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, డాక్టర్ వెంకటరామయ్య, ఆర్యవైశ్య సంఘం నేతలు కూనా సత్యం, బలసా వేణుగోపాల్, రాజేష్, సుధీర్, మల్లికార్జున, మహల్ రవి, ఆంజినేయులు, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

జిల్లా ఆసుపత్రికి పరికరాల వితరణ

మదనపల్లె : స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి రూ.1 లక్ష విలువ చేసే పరికరాలను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రమాలా దంతవైద్యశాల వైద్యులు డాక్టర్ హరిజయకృష్ణ సోమవారం అందజేశారు. ఆసుపత్రికి అవసరమైన 25 ఫ్యాన్లు, రెండు కంప్యూటర్లు, మూడు సీసీ కెమెరాలు, రెండు ప్రింటర్లను విరాళంగా సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవికి అప్పగించారు. ప్రభుత్వాసుపత్రికి ఎంతో మంది రోగులు వస్తుంటారని, వారికి ఉపయోగకరంగా ఉండేందుకు పరికరాలు అందజేసినట్లు దాత జయకృష్ణ చెప్పారు. ప్రతి ఒక్కరూ సాయం అందించి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



పరికరాలు అందజేస్తున్న డాక్టర్ జయకృష్ణ

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేయండి

మదనపల్లె : పట్టణంలో బలిజ సేవాసమితి సేవా కార్యక్రమాలు పలువురి మన్ననలు పొందాయని, వాటిలో తనకు, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు అవకాశం కల్పించాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. సోమవారం శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి హాజరైన ఎంపీ మిథున్‌రెడ్డి శ్రీకృష్ణదేవరాయలను కీర్తించారు. బలిజసేవాసమితి సేవలను ప్రశంసించారు. ప్రజారంజకంగా పాలన అందించడంలో అప్పటికే కాదు, నేటితరాలకు, రాబోవు 1,000 ఏళ్లకు శ్రీకృష్ణదేవరాయలు రోల్‌మోడల్‌గా నిలుస్తారన్నారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథులను బలిజసేవాసమితి సభ్యులు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులు, టీటీడీ బోర్డ్ మెంబర్ పోకల అశోక్‌కుమార్ మదనపల్లె బలిజసేవాసమితి సభ్యులను ఘనంగా సన్మానించారు. విగ్రహ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బలిజసేవాసమితి అధ్యక్షులు బీపీఎల్.విజయకుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జింకాచలపతి, కార్యదర్శి విజయలక్ష్మిభాస్కర్, తోటమదనేశ్వర్, భానుప్రకాష్, మోహన, తంగాలశ్రీనివాసులు, రాజ్‌భవన్‌రాజా, శ్రీరామరామాంజులు, పెట్రోల్‌బంక్ సూరి, జంగాల శివరాం, సాక్కంవేణుగోపాల్, కే.శ్రీనివాసులు, శశికాంత్, జయచంద్ర, విజయలక్ష్మీ శ్రీనివాసులు తదితరులను ఘనంగా సన్మానించారు. బీపీఎల్.విజయ్ కుమార్ మాట్లాడుతూ రాయల విగ్రహ ఏర్పాటుకు సహకరించడంతో పాటుగా, కల్యాణమండపం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినందుకు మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నితీష్ రాయల్ డెవలపర్, హిందూట్రేడింగ్ కంపెనీ యజమాని కోడికండ్ల అమరనాథ్ బలిజసేవాసమితి సేవా కార్యక్రమాలకు రూ.2లక్షల విరాళాన్ని అందించారు.



అమరనాథ్‌ను సన్మానిస్తున బలిజసేవాసమితి సభ్యులు